**పోటెత్తుతున్న భక్తులు.. 10 కోట్ల మంది పుణ్యస్నానాలు**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 10 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ 10.21 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది. ఇక అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య అయిన జనవరి 29న రానుంది. ఆ రోజు ఏకంగా 10 కోట్ల మంది కంటే అధికంగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు.సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :287 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 25-01-2025 పేజీలు:4 వెల: 2.00


## హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ దేవరాజ్‌ను మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సన్మానించారు. త్వరలో జరగనున్న ఐసీసీ క్రికెట్ టోర్నమెంట్‌కు భారత జట్టుకు మేనేజర్‌గా నియమితులైన సందర్భంగా దేవరాజ్ శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవరాజ్‌ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చాయ్ వాలా వల్లే ఆ రైలు ప్రమాదం : మహారాష్ట్ర డిప్యూటీ సీఎం



ముంబై : మహారాష్ట్రలోని జల్‌గావ్ సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో13 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఈ ప్రమాద ఘటనపై నిన్న మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. చాయ్ వాలా పుకార్ల వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. అగ్నిప్రమాదం సంభవించినట్లు ఆ చాయ్ వాలా ప్రయాణికులకు అవాస్తవం చెప్పడంతో, భయంతో అలారం చైన్ లాగి బయటకు దూకేశారని తెలిపారు. ఇంతలో అదే ట్రాక్ పైన బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్తున్న కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చింది. ట్రాక్‌పైన ఉన్న ప్రయాణికులను ఈ రైలు ఢీకొట్టడంతో పెను ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడికక్కడే 13 మంది మృత్యువాత పడ్డారు. ఛిద్రమైన మృతదేహాలు, తెగిపడిన అవయవాలతో ఘటనాస్థలి భీతావహంగా మారిన సంగతి తెలిసిందే.

## 10 కోట్ల మంది పుణ్యస్నానాలు



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 10 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

%ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ 10.21 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది. ఇక అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య అయిన జనవరి 29న రానుంది. ఆ రోజు ఏకంగా 10 కోట్ల మంది కంటే అధికంగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు.సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు.

## గడికోట మహాదేవుని ఆలయంలో ప్రియాంక చోప్రా పూజలు



బాలీవుడ్ స్టార్ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రసిద్ధ ఆలయాలను సందర్శిస్తున్నారు. మొన్నటికి మొన్న చిలుకూరు బాలాజీ టెంపుల్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని మరో ఆలయాన్ని పీసీ సందర్శించారు. %కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోట మహాదేవుడి ఆలయాన్ని ప్రియాంక శుక్రవారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి ఇవాళ ఉదయం కారులో బయల్దేరి దోమకొండ చేరుకున్నారు. అక్కడ గడికోటలో కొలువుదీరిన ప్రసిద్ధ మహాదేవుని ఆలయానికి వెళ్లారు. ఆలయంలోని సోమసూత్ర శివలింగానికి పీసీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వీడియోని పీసీ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో షేర్ చేసింది. పొగమంచుకు సంబంధించిన వీడియోను కూడా పంచుకుంది. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి నిరసన



సిద్దిపేట : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డుసభలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతల నడుమ కొనసాగుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో అనర్హులు, కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యమిస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. తాజాగా ఇందిరమ్మ గృహనిర్మాణ పథకంలబ్ధిదారుల జాబితా నుంచి తనను తొలగించడాన్ని నిరసిస్తూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట గ్రామస్తుడు మైండ్ల రాజు తన పేరును జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సెల్ టవర్ ఎక్కాడు. శుక్రవారం జరిగిన గ్రామసభ సమావేశంలో అధికారులు విడుదల చేసిన ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆవేదనకు గురైన రాజు సెల్ టవర్ ఎక్కాడు. అధికారులు తన పేరును జాబితాలో చేర్చకపోతే సెల్ టవర్ పైనుంచి కింద దూకుతానని బెదిరించాడు. జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ నుంచి కూడా హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు ఫోన్‌లో మాట్లాడి రాజును కిందకు దింపడానికి ప్రయత్నించారు. కాగా, జాబితాలో చాలా మంది ఇతర వ్యక్తుల పేర్లు కనిపించాయని, అయితే వారు అనర్హులు అని ఆయన ఆరోపించారు.

## జైల్లో ఉన్నప్పుడు నాకు సీఎం పదవి ఆఫర్ చేశారు

భారతీయ జనతాపార్టీపై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను తీహార్ జైల్లో ఉన్న సమయంలో బీజేపీ తనకు ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చేసిందని ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓ జాతీయ మీడియాతో సిసోడియా మాట్లాడుతూ.. జైల్లో తాను ఇబ్బందులు పడుతున్న విషయం బీజేపీకి అర్థమైందన్నారు. దానికి తోడు తన భార్య అనారోగ్యం బారినపడటం, కుమారుడు చదువుకుంటున్నాడని తెలిసి వాళ్లు తనకు బీజేపీలో చేరాలంటూ ఆఫర్ ఇచ్చినట్లు చెప్పారు. అలా చేస్తే ఆప్ కూటమిని విచ్ఛిన్నం చేస్తామని, ఆ తర్వాత తనను సీఎంను చేస్తామని బీజేపీ నేతలు చెప్పినట్లు సిసోడియా వివరించారు. దీనికి అంగీకరించకుంటే సుదీర్ఘకాలంపాటు జైల్లోనే ఉండాల్సి వస్తుందని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. 'కేజ్రీవాల్‌ను వదిలెయ్.. లేదంటే జైల్లోనే మగ్గిపో..' అంటూ అల్టిమేటం జారీ చేశారని సిసోడియా ఆరోపించారు.ఇతర పార్టీల నేతలను కొనుగోలు చేయడమే బీజేపీ విధానమని ఈ సందర్భంగా సిసోడియా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రజల అవసరాలతో వారికి ఎటాంటి పట్టింపులూ ఉండవని వ్యాఖ్యానించారు. కేవలం అధికారం కోసమే ఆరాటపడుతున్నారన్నారు. వారి మాట వినకుంటే తప్పుడు కేసులతో జైలుకు పంపుతారని దుయ్యబట్టారు.

## 50 లక్షల ఖరీదైన 20,000 మద్యం బాటిళ్లు సీజ్

న్యూఢిల్లీ: ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే గత వారం రోజుల నుంచి ఢిల్లీలో ఎక్సైజ్ అధికారులు సుమారు 50 లక్షల ఖరీదైన 20 వేల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన దాంట్లో 15,376 లీటర్ల దేశీయ, విదేశీ అక్రమ మద్యం ఉన్నది. 1.5 కోట్ల విలువైన 32 వాహనాలను కూడా పట్టుకున్నారు. అక్రమ మద్యం సీజ్ కేసులో ఇప్పటి వరకు 52 కేసులను రిజిస్టర్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత సీజ్ చేసిన మొత్తం మద్యంలో 25 శాతం ఎక్సైజ్ శాఖదే ఉన్నది. హర్యానాతో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యాన్ని పట్టుకునేందుకు ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ బ్యూరో తీవ్రంగా పనిచేస్తున్నది. 70 అసెంబ్లీ స్థానాలు ఉన్న ఢిల్లీలో ఫిబ్రవరి 5వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు.



## గ్రామ సభల్లో మర్లబడుతున్న తెలంగాణ..



హైదరాబాద్ : గ్రామసభల్లో తెలంగాణ ప్రజలు మర్లబడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. గ్రామ సభలు రణసభలుగా మారాయంటేనే.. కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్యూర్‌కు నిదర్శనం అని హరీశ్‌రావు చెప్పారు. %జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామసభలో మాజీ సర్పంచ్ నాగరాజు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం బాధాకరం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేదని ములుగు జిల్లా బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగయ్య అనే దళిత రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడటం మనస్సు కలిచివేసింది. గ్రామ సభల్లో జరుగుతున్న ఇలాంటి వరుస ఘటనలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. తన చావుతోనైనా అర్హులైన పేదలకు పథకాలు ఇవ్వాలని అధికారులకు చెబుతూ పురుగుల మందు తాగి, ఆసుపత్రి పాలైన ఆ రైతన్న దుస్థితికి ప్రభుత్వమే కారణం అని హరీశ్‌రావు మండిపడ్డారు.

పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే..

పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావతో, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరపకుండా, జాబితాను విడుదల చేయడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. దీంతో పాటు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు అంటూ బాహాటంగా ప్రకటించడంతో గ్రామ సభల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పట్ల ప్రజల్లో ఆందళన మొదలైంది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ఈనెల 26వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ, మరోవైపు గ్రామ సభల్లో విడుదల చేసిన జాబితా ఫైనల్ కాదని సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి చెప్పడం హాస్యాస్పదం. అలాంటప్పుడు నాలుగు రోజుల పరిమితి పెట్టి గ్రామ సభలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి? గ్రామ సభల్లో విడుదల చేస్తున్న అర్హుల జాబితాకు ఉన్న విలువ ఏంది? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## రైతు కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్



ఆదిలాబాద్ : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్‌జిల్లాలోని గుడిహత్నూర్ మండలం నేరడిగొండ తండాకు చెందిన ఆడే గజానంద్ రైతు కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ బృందం పరామర్శించింది. కమిటీ ఛైర్మన్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, సభ్యులు మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, జోగు రామన్న ఎమ్మెల్సీలు ఎంసీ కోటి రెడ్డి, యాదవ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ బాధిత కుటుంబం సాదకబాధలను అడిగి తెలుసుకున్నారు. %ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యయన కమిటీలు నియమించారన్నారు. అందులో భాగంగా నేడు ఇక్కడికి వచ్చామన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు ఎళ్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మృతుడు గజానంద్ కుటుంబానికి సొంత డబ్బులు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ప్రజలను, రైతులను కాంగ్రెస్ మోసం చేస్తుందన్నారు. త్వరలోనే కేసీఆర్ నాయకత్వంలో మంచి వస్తాయన్నారు.

## ఏపీ హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తుల ప్రమాణం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ , డాక్టర్ యడవల్లి లక్ష్మణరావుతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన జడ్జిలను పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందించారు.

రాష్ట్ర హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులకు గాను ప్రస్తుతం 28 మంది పనిచేస్తున్నారు. ఇద్దరి నియమకంతో ఆ సంఖ్య 30కు చేరుకోంది. మరో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇద్దరు రెండేళ్ల పాటు అదనపు న్యాయమూర్తులుగా , ఆతరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు. ప్రకాశం జిల్లాకు చెందిన జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు , కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తిగా హరిహరనాథ శర్మ పలు కోర్టుల్లో వివిధ సేవలను అందించారు.

## కశ్మీర్‌లోని రాజౌరీలో అంతుచిక్కని వ్యాధి..



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీజిల్లాలో అంతుచిక్కని వ్యాధి ప్రబలుతున్నది. దీంతో గత కొన్ని రోజుల నుంచి ఆ రహస్య వ్యాధి వల్ల సుమారు 17 మంది మరణించారు. బదాల్ గ్రామంలో జరుగుతున్న పరిణామాలపై కేంద్రం స్టడీ చేస్తున్నది. అయితే ఆ అజ్ఞాత శత్రువు ఆనవాళ్లను గుర్తించే పనిలో ప్రభుత్వం ఉంది.డిసెంబర్ ఏడవ తేదీ నుంచి బదాల్ గ్రామంలో మూడు కుటుంబాలకు చెందిన 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో అయిదు మంది పరిస్థితి విషమంగా ఉన్నది. బాధితులు న్యూరో సంబంధిత లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆ పేషెంట్లలో కేంద్ర నాడీ వ్యవస్థతో పాటు మెదడు కూడా డ్యామేజ్ అవుతున్నట్లు పసికట్టారు.మృతులతో కాంటాక్టులోకి వచ్చిన సుమారు 300 మందిని క్వారెంటైన్ చేశారు. రాజౌరీలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వాళ్లను క్వారెంటైన్ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కనిపించని శత్రువుతో యుద్ధం జరుగుతున్నట్లు స్థానిక డాక్టర్లు తెలిపారు. సంక్షోభాన్ని ఎదుర్కొనే రీతిలో చర్యలు తీసుకుంటున్నట్లు రాజౌరీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అమర్‌జీత్ సింగ్ భాటియా తెలిపారు.ప్రభావిత ప్రాంతాన్ని మాస్క్ లేకుండా విజిట్ చేశానని, తనకు ఎటువంటి అనారోగ్యం కలగలేదని డాక్టర్ భాటియా స్పష్టం చేశారు. వైరల్, బ్యాక్టీరియా, ప్రోటోజోవా, జూనాటిక్ సంక్రమణలు జరగడంలేదన్నారు. స్థానికులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. మృతుల శరీరాల్లో కాడ్మియం ఆనవాళ్లు ఉన్నట్లు ప్రాథమిక అంచనా ద్వారా తెలుస్తోందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.లక్నోలోని టాక్సికాలజీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన పరీక్షల్లో.. మృతుల శరీరాల్లో కాడ్మియం ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే వారి శరీరాల్లోకి కాడ్మియం మూలకం ఎలా ఎంటరైందన్న కోణంలో విచారణ సాగుతోందన్నారు. కాడ్మియం చాలా విషపూరితమైన ఖనిజం. ఒకవేళ దాన్ని కడుపులోకి తీసుకున్నా.. లేక పీల్చినా.. దాని వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కలుషిత గాలి, ఆహారం, నీటి వల్ల కాడ్మియం శరీరంలోకి వచ్చే ఛాన్సు ఉన్నది.

## సంపాదకీయం

శనివారం 25-01-2025

# మరో నిరంకుశ చర్య

వైస్ ఛాన్సలర్ల నియామకంపై గవర్నర్లకు పూర్తి అధికారం కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రాష్ట్రాల హక్కులకు పాతర వేయడమే! ఈ నోటిఫికేషన్ ద్వారా ఉన్నత విద్యా వ్యవస్థలో ఊహించడానికి కూడా సాధ్యం కాని మార్పులను కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం తలపెట్టింది. వాటిలో అత్యంత కీలకమైనది వైస్ ఛాన్సలర్ల నియామక నిబంధనలను పూర్తిగా మార్చడానికి ప్రతిపాదించడం. వీరి నియామకాలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పాత్రను పూర్తిగా తొలగించడంతో పాటు, అన్ని అధికారాలను గవర్నర్లకు అప్పగించాలని పేర్కొనడంతో పాటు, వైస్ ఛాన్సలర్లకు ఎంపికకు సంబంధించిన విద్యాపరమైన అర్హతలను సడలించారు. విశ్వవిద్యాలయాలంటేనే మేథో నిలయాలు! వేనవేల చర్చలకు, భావాల ఘర్షణకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రాలు! ఒక్క మాటలో చెప్పాలంటే భవిష్యత్ దేశ నిర్మాణం ఇక్కడే జరుగుతుంది. అటువంటి సంస్థకు నాయకత్వం వహించే వ్యక్తి ఎలా ఉండాలి? తాజా మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు రంగానికి చెందిన వారితో పాటు, ఎటువంటి అకడమిక్ అనుభవం లేని వారిని కూడా వైస్ ఛాన్సలర్లగా నియమించే అవకాశం ఉంది. పైగా దీనికి సంబంధించి ఎటువంటి సెర్చి కమిటీలు, అధ్యయనాలు, పరిశీలనలు ఉండవు. అంతా గవర్నర్ కన్నుసన్నల్లోనే! కీలకమైన బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన నియామకాల్లోనూ ఇటువంటి మార్పులనే కేంద్రం తాజాగా ప్రతిపాదించింది. గవర్నర్‌కు అప్పగించే అధికారాలు నిజానికి కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మతతత్వ, కార్పొరేట్ శక్తుల కలయికగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఉందన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అనేక కీలక రంగాలను సంఘ్ పరివారంతోనూ, ఆ భావజాలంతోనూ నింపిన ఘనత కేంద్ర సర్కారుకు ఉంది. ఇప్పుడు ఉన్నత విద్యా రంగాన్ని అటువంటి మౌఢ్యపు ఆలోచనలతో మెదళ్లను నింపుకున్న వారితోనూ, ఆ భావజాలాన్ని ప్రచారం చేసే వారితోనూ నింపివేయడానికే ఈ కుటిల ఎత్తుగడలకు పాల్పడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పనిలోపనిగా ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో వ్యాపార మయం చేసి తమ కార్పొరేట్ బాస్‌ల ఆకాంక్షలను నెరవేర్చడానికి కూడా ప్రతిపాదిత మార్పులు ఉపయోగపడతాయి. అందుకే, రాష్ట్ర ప్రభుత్వాలతో, విద్యారంగ నిపుణులతో ఏ మాత్రం చర్చించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం, యుజిసి ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశాయి. ఈ చర్య పూర్తిగా అప్రజాస్వామికం!రాజ్యాంగపు 42వ సవరణ ద్వారా ఉన్నత విద్యను రాష్ట్ర జాబితా నుండి, ఉమ్మడి జాబితాలోకి బదిలీ చేశారు. దీనర్థం కేంద్ర ప్రభుత్వానికి విశేషాధికారాలు కట్టబెట్టినట్లు కాదు. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ రాష్ట్రాల జాబితాలోని 32వ అంశం ప్రకారం విశ్వవిద్యాలయాలను స్థాపించడానికి, పర్యవేక్షించడానికి రాష్ట్రాలకు అధికారం ఉంది. అందువల్లే, వివిధ రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు ఆయా రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన చట్టాల ప్రకారమే నడుస్తాయి. ఆర్టికల్ 66 ప్రకారం ఉన్నత విద్యాలయాలు, పరిశోధన సంస్థలకు మధ్య సమన్వయం చేయడానికి, ప్రమాణాలు నిర్దేశించడానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. 1949 ఆగస్టు 31న రాజ్యాంగ సభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడా ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పారు. యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల నిర్వహణ కోసం అవుతున్న ఖర్చులో 80 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయి. అయితే, ఈ వాస్తవ పరిస్థితులు, రాజ్యాంగ నిర్దేశాలను కేంద్రంలోని మోడీ సర్కారు నామమాత్రంగా కూడా పట్టించుకోవడం లేదు. అందుకే, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఈ చర్యపై తీవ్రంగా స్పందించా యి. రెండు రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యాశాఖ మంత్రులు కేంద ప్రభుత్వానికి, ఎన్‌డిఎ యేతర పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు రాశారు. ఆ రెండు రాష్ట్రాలే కాదు. ఉన్నత విద్యను కాషాయీకరించడాన్ని, వ్యాపారమయం చేసే ఎత్తుగడలను తిప్పికొట్టడానికి జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి. రాజ్యాంగాన్ని, అది నెలకొల్పిన విలువలను రక్షించుకోవాలి.

# బడ్జెట్ ప్రజల ఆకాంక్షలు అందుకునేనా ?

న్యూఢిల్లీ,మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఫిబ్రవరి1న బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్ మరోమారు సిద్దంగా ఉన్నారు. ఎప్పటిలాగే ఈ సారి బడ్జెట్ సమావేశాలు ఉంటాయా లేక మరేమైనా అద్భుతాలు ఉంటాయా అన్నది ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఇన్‌కమ్ ట్యాక్స్, జిఎస్టీ, నిరుద్యోగం, రూపాయి పతనం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల వంటివి దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఈ క్రమలంఓ అధికార, విపక్షాలు బాధ్యతగా ముందుకు సాగాల్సిన సమయమిది. పార్లమెంట్ అనగానే విమర్శలు, ప్రతి విమర్శలతో కాలయాపన చేయడం, వాకౌట్లు చేయడం, ఆందోళనలకు దిగడం సరికాదు. మారుతున్న కాలానుగుణంగా ప్రజల అవసరాల మేరకు ప్రతిపక్షాలు ఆయా అంశాలపై చర్చలు జరిగి ప్రభుత్వం నుంచి సమాధానం రాబట్టే ప్రయత్నాలు చేయాలి. పార్లమెంటులో ఒకకో సమస్యపై చర్చకు ఒక్కో విధానం ఉంది. అంతేతప్ప తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా విపక్షం వ్యయహరించరాదు. ఇక అధికార పక్షం కూడా తామంతా గత పదేళ్లుగా బ్రహ్మండంగా పనిచేశామని, భారత్‌ను ఉద్దరించామన్న ధోరణి నుంచి బయటపడాలి. ప్రజలు ఏం కోనుకుంటున్నారో గుర్తించాలి. అంతర్గత చర్చలకు అవకాశం ఇవ్వాలి. వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతున్నా..ప్రజల్లో మాత్రం వికసిత జీవితాలు కనిపించడం లేదు. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం బలంగా ఉంది. పేదల అభివృద్ధి అటేనే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే పేదలు బాగుపడాలి. కానీ పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. మధ్యతరగతి ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో చర్చించాలి. ధరల పెరుగుదలను చూస్తుంటే ప్రబుత్వాలు ఎంత అధ్వాన్నంగా పాలన చేస్తున్నాయో గమనించాలి. నిత్యాసవర ధరలు, ఔషధాల ధరలు అడ్డదిడ్డంగా పెరుగుతున్నాయి. గ్రామిీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పడం కన్నా, గ్రామాలకు వెళ్లి నిరూపించాలి. ఎంపిలు దూడూ బసవన్నల్లాగా తలూపకుండా సమస్యల పై చర్చించాలి. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, సకాలంలో రుణాలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి. అందుకే బడ్జెట్‌లో విస్తృత చర్చ జరగాలి. అలాగే సామాన్యులు బతకడమెలా అన్నది పాలకులు ఆలోచించినప్పుడే దేశ ఆర్థికవృద్ధి సాధ్యం కాగలదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగి నప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించ బోతుందని మోడీ సహా నేతలంతా పేర్కొంటూ..రాజకీయ పబ్బం గడుపుతున్నారు. విజన్ డాక్యుమెంట్ల పేరుతో ఇంకెంతోకాలం వంచించలేదు.




2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్న వారు అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు సిద్దంచేయాలి. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోడీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కనే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ మోతలను సంస్కరించాలను కోవడం లేదు. ఆదాయపన్నును పరిశీలించడం లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో చర్చించాలి. కేవలం లెక్కలు చెప్పి బుకాయించడం కుదరదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గుర్తించాలి. అధికారులు వేసే లెక్కలకు తలూపడం కాకుండా క్షేత్రస్థాయి సమస్యలను చర్చించినప్పుడే వికసిత భారత్ సాధ్యం కాగలదు. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల నుంచి లక్షా 70వేల కోట్ల వరకు చూసి మురిసిపోతున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించినా, జిఎస్టీ లాంటి పన్నులు మోత మోగిస్తున్న తీరు ప్రజల దివాళాను సూచిస్తోంది. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో జీవిస్తున్నారు. మంచి రోజులు వస్తాయన్న నమ్మకంతో బతుకుతున్నారు. అలాంటి వారికి బడ్జెట్ స్వాంతన కావాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావాలి. బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. ఇవన్నీ కూడా బడ్జెట్ పద్దుల్లో చర్చించాల్సి ఉంది. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. అప్పుడే సామాన్యులకు అండగా ప్రభుత్వం ఉందన్న నమ్మకం కలుగుతుంది.

# ఏపీ నూతన డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా?

అమరావతి,ఏపీ నూతన డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా నియమితులయ్యే ఛాన్స్ ఉంది. 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ప్రస్తుత డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో హరీష్ గుప్తాను తదుపరి పోలీస్ బాస్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. తిరుమలరావు ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదవీ విరమణ తర్వాత ఆయన్ను ఆ పోస్టులో కొనసాగించే అవకాశం ఉంది.కాగా, సార్వత్రిక ఎన్నికల సమయంలో హరీష్ కుమార్ గుప్తాను ఏపీ డీజీపీగా ఎన్నికల సంఘం నియమించింది. దీంతొ కొన్ని రోజుల పాటు ఆయన ఆ పోస్టులో కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలరావును డీజీపీగా నియమించింది. ఆయన పదవీ విరమణ చేశాక సీనియారిటీ జాబితాలో 1991వ బ్యాచ్‌కు చెందిన అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ మొదటి స్థానంలో ఉంటారు. హరీష్ గుప్తా రెండో స్థానంలో ఉన్నారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి,ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సరస్వతీ పవర్ ప్లాంట్‌కు కేటాయించిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. సరస్వతీ భూముల్లో అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నాయన్న అధికారుల నివేదికతో చర్యలు చేపట్టింది. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరంలో సరస్వతీ పవర్ ఇండస్ట్రీస్ భూముల రిజిస్ట్రేషన్‌ను క్యాన్సిల్ చేసింది. వేమవరంలో 20 ఎకరాలు, పిన్నెల్లి గ్రామంలో 4.84 ఎకరాల అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్‌ను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో అధికారులు రద్దు చేశారు. ఈ మేరకు పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ సురేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ భూములు వెనక్కు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, పల్నాడు జిల్లా జగన్ కుటుంబానికి సరస్వతీ పవర్ ఇండస్ట్రీస్ భూములు కేటాయించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 1,516 ఎకరాల భూముల్లో అటవీ, ప్రభుత్వ భూములు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. చెన్నయపాలెం, వేమవరం, పిన్నెల్లి, తంగెడ గ్రామాల్లో మొత్తం 1,250 ఎకరాలు రైతుల నుంచి సరస్వతీ పవర్ ప్లాంట్ యాజమాన్యం కొనుగోలు చేసింది. అయితే, అప్పటి నుంచి ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేయలేదని స్థానికులు ఆరోపించారు. ఇదే భూముల్లో అటవీ శాఖ భూములు కూడా ఉన్నాయన్న వివాదంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం పర్యటించారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం సదరు భూముల్లో పూర్తి స్థాయి సర్వే చేపట్టింది. గత నవంబరులో అసైన్డ్ ల్యాండ్స్‌కు సంబంధించిన వ్యవహారంపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగానే వేమవరం, పిన్నెల్లి గ్రామాల్లో 24.84 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ ఉన్నట్లు గుర్తించారు. ఈ భూములు రద్దు కోరుతూ నివేదిక ఇవ్వడంతో సరస్వతి పవర్ ప్లాంట్స్ భూమిలోని అసైన్డ్ ల్యాండ్స్ రిజిస్ట్రేషన్ రద్దు చేశారు.

# వలసవాదులపై ట్రంప్ ద్వేషం




సెంట్రల్ డెస్క్:'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అన్న నినాదంతో అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తీసుకున్న కొన్ని నిర్ణయాలు అమెరికాలో ఆందోళనలకు దారి తీస్తున్నాయి. ప్రపంచంలో తిరుగులేనిశక్తిగా అమెరికా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించడంలో తప్పులేదు. కానీ అది నియంతృత్వానికి, సామ్రాజ్య విస్తరణ కాంక్షకు దారితీస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వలసలను కట్టడిచేసే దిశగా జన్మతా వచ్చే పౌరసత్వం రద్దుపై డెమోక్రాటిక్ పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఇప్పటికే న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ఇదే విధంగా లక్షలాది అనధికార వలసవాదులపైన, అమెరికా సరిహద్దుల్లోకి ప్రవేశించడానికి అనుమతి కోరే వలసవాదులపైన విపరీత ప్రభావం పడే పరిస్థితి కనిపిస్తోంది.అలాగే నేరస్థులైన విదేశీయుల్ని వెంటనే బహిష్కరించడానికి కట్టుబడి ఉన్నట్టు ట్రంప్ ప్రకటించారు. గత బైడెన్ ప్రభుత్వం 15 మిలియన్ల నుంచి 20 మిలియన్ల వరకు అక్రమ వలసవాదులను అమెరికా దేశంలోకి ప్రవేశింప చేశారని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఇదిలా వుండగా అక్రమ వలసదారుల నిర్బంధ బిల్లుకు కాంగ్రెస్ బుధవారం(జనవరి 22) ఆమోదం తెలపడం విశేషం. కానీ వలసవాదుల వెనుక ఉన్న వాస్తవాలను పరిశీలిస్తే వాటిని ట్రంప్ విపరీతంగా వక్రీకరిస్తున్నట్టు బయటపడుతోంది. అధికారిక అంచనాల ప్రకారం 11 మిలియన్ మంది వలసవాదులు అమెరికాలో ఉన్నారు. ఇతర అంచనాల బట్టి చూస్తే 13 మిలియన్ల నుంచి 14 మిలియన్ల వరకు అక్రమ వలసవాదులు ఉన్నారని తెలుస్తోంది. ఇవేవీ ట్రంప్ నిర్ధారణలకు పొంతన లేకుండా ఉన్నాయి. 2022 నాటికి 2.3 లక్షల భారతీయ వలసవాదులు ఉన్నారని తేలింది.అమెరికాలో ప్రస్తుతం ఎలాంటి ధ్రువపత్రాలు లేని 11 మిలియన్ వలసవాదుల్లో 80% మంది 2010కు ముందు అమెరికా వచ్చినవారే. వీరిలో 1.5 మిలియన్ మంది కొన్ని దశాబ్దాల క్రితం 19801990 మధ్య అమెరికాకు వచ్చారు. ఎవరు అమెరికాలో శరణార్థులుగా ఆశ్రయం పొందాలో, ఎవరు పొందకూడదో నిర్ణయించే ఇమ్మిగ్రేషన్ కోర్టు ఉన్నతాధికారులను కూడా ట్రంప్ డిస్మిస్ చేసినట్టు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ కోర్టుల్లో 3 మిలియన్ కన్నా ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంతేకాకుండా అమెరికాలో ఆశ్రయం పొందడానికి అభ్యర్థించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన మొబైల్ యాప్ సిబిపి వన్‌ను కూడా ట్రంప్ మూసివేయించారు. కేవలం ఒక ఏడాది లోనే ఇమ్మిగ్రేషన్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 2.4 మిలియన్ నుంచి 3.5 మిలియన్‌కు పెరిగింది. అమెరికాకు అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నించే వారి సంఖ్య ఇటీవల సంవత్సరాల్లో విశేషంగా పెరిగింది. దశాబ్దం క్రితం 1500 మంది భారతీయ అక్రమ వలసవాదులను అమెరికా సరిహద్దు అధికారులు అడ్డుకున్నారు. అయితే ఈ సంఖ్య 2023లో 96.917 కు. 2024లో 90415 కు పెరిగింది. అలాగే అమెరికాలో ఆశ్రయంకోరే భారతీయుల సంఖ్య కూడా పెరిగింది. హింసాత్మకం కాని చిన్నచిన్న నేరాలకు పాల్పడిన వారిని కూడా బందీలుగా చేయడానికి, దేశం నుంచి బహిష్కరించడానికి వీలు కల్పిస్తూ సెనేట్ ఆమోదించిన బిల్లు అధికారులకు సాధికారత కల్పిస్తోంది. కానీ విదేశాలనుంచి వచ్చే వలసవాదులు దేశంలో హింసాత్మక నేరాలను ప్రేరేపిస్తారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. కానీ ధ్రువీకరణ పత్రాలు లేకుండా వలసవచ్చిన వారిలో హింసాత్మక నేరాల రేటు అమెరికాలో పుట్టిన పౌరుల రేటు కన్నా తక్కువగానే ఉందని డేటా చెబుతోంది. నిర్దిష్ట జనాభా పాల్పడిన క్రిమినల్ నేరాల సంఖ్యను ఈ రేటు కొలమానంగా చెబుతుంది.అమెరికాలో పుట్టిన పౌరులు, ధ్రువీకరణ పత్రాలు కలిగిన వలసవాదులు, ధ్రువీకరణ పత్రాలు లేని వలసవాదులు 2012 2018 మధ్యకాలంలో టెక్సాస్‌లో పాల్పడిన హింసాత్మక నేరాల పట్టికను పరిశీలిస్తే అమెరికాలో జన్మించిన పౌరులు చేసిన నేరాలలో సగం మాత్రమే అనధికార వలసవాదులు చేసినట్టు వెల్లడైంది. అంతేకాక అధికార వలసవాదుల కన్నా తక్కువ నేరాలే అనధికార వలసవాదులు చేసినట్టు తెలుస్తోంది. అమెరికా శ్రామికశక్తిలో అనధికార వలసవాదుల వాటాయే చెప్పుకోదగినంతగా మెజారిటీ స్థాయిలో ఉంటోంది. ముఖ్యంగా నిర్మాణరంగం, వ్యవసాయరంగంలో వీరి శ్రమశక్తి భాగం అధికంగా కనిపిస్తోంది. వలసవాదులను సామూహికంగా బయటకు పంపేస్తామని ట్రంప్ చెబుతుండడం, ఈ మేరకు చర్చలు జరుగుతుండడం ఆయా రంగాల వాణిజ్య సంస్థల యజమానులు ఆందోళన చెందుతున్నారు.తగిన ప్రత్యామ్నాయాలు వెతుక్కోవలసి ఉంటుందని అంటున్నారు. సెంటర్ ఫర్ మైగ్రేషన్ స్టడీస్ ఆఫ్ న్యూయార్క్ 2018 లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం 5.5 మిలియన్ అన్‌డాక్యుమెంటెడ్ (ధ్రువీకరణ పత్రాలు లేని అనధికార) వలసవాదులు అమెరికా శ్రామికశక్తిలో భాగంగా ఉంటున్నారని బయటపడింది. ఇప్పుడు సామూహికంగా వీరందరినీ అమెరికానుంచి బయటకు వెళ్లగొడితే తక్షణం నిర్మాణరంగం పైన, వ్యవసాయ క్షేత్రాల పైన , రెస్టారెంట్ల పైన వ్యతిరేక ప్రభావం చూపిస్తుందని అధ్యయనకర్తలు చెబుతున్నారు. తోటపనులు, లాండ్రీ, ఆటోరిపైర్, సేఫ్టీ, శానిటేషన్, తదితర అత్యవసర సేవలకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతుంది. ధ్రువీకరణ పత్రాలులేని వలసవాదుల సంఖ్య ఎంతో స్పష్టంగా తెలుసుకోకుండా వారిని బయటకు పంపించివేయడానికి నిర్ణయాలు తీసుకోవడం సమస్యలకు దారితీస్తుంది. చాలా మంది అమెరికాలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. అత్యవసర సేవల్లో పాలుపంచుకుంటున్నారు. ఎలాంటి క్రిమినల్ నేరాలకు వీలైనంతవరకు పాల్పడకుండా జీవించగలుగుతున్నారు. ఇప్పుడు వీరందరినీ బయటకు పంపేస్తామని చెప్పడం అమెరికా ప్రజల దైనందిన జీవితాలపై కూడా ప్రభావం పడుతుంది.

## మావోయిస్టుల పేల్చివేత కుట్ర భగ్నం

బీజాపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. బాసగూడ–ఆవపల్లి మార్గంలో పోలీసుల వాహనాలను పేల్చేందుకు మావోయిస్టులు అమర్చిన 50 కిలోల మందుపాతరను సీఆర్‌పీఎఫ్ దళాలు నిర్వీర్యం చేశాయి. హైవేపై సొరంగం తవ్వి కల్వర్టు కింద మావోయిస్టులు మందుపాతర అమర్చినట్టు అధికారులు తెలిపారు. ముందుగానే గుర్తించి నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 20 మందికిపైగా మావోయిస్టులు మరణించారు. ఈ క్రమంలో మావోయిస్టుల కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.

# మెడికల్ టెర్రర్!

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో నకిలీ, కల్తీ మెడిసిన్స్? అమ్మకాలు పెరిగినట్టు తెలుస్తోంది. డ్రగ్స్ స్టాండర్డ్స్‌పై తనిఖీలు చేయకపోవడం.. మెడిసిన్స్? మూలాలను వెతకకపోవడంతో కల్తీ పెరిగినట్టు సమాచారం. ఈ మధ్య డ్రగ్? ఆఫీసర్లు చేస్తున్న తనిఖీల్లో పలు లోపాలు బయటపడుతుండడమే నిదర్శనం. తెలంగాణపై డ్రగ్స్ మాఫీయా, మత్తు పదార్థాల మాఫీయా, కల్తీ మాఫీయా ఇలా ఎన్నో రకాలుగా దాడులు జరుగుతున్నాయి. దానికి తోడు నాణ్యత లేని, నకిలీ మందులు కూడా చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను రక్షించే మందులకు సంబంధించిన నేరాల సంఖ్య పెరుగుతోంది. తెలంగాణ స్టేట్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ 2024లో ?7.46 కోట్ల విలువైన నాణ్యత లేని, కాలం చెల్లిన మందులను సీజ్ చేసింది. మెడికల్ షాపులు నిబంధనలు ఉల్లంఘించిన నేరాలు కూడా బాగా పెరిగాయి. 2023లో 56 కేసులుండగా.. అవి ఏడాదిలో 573కి పెరిగాయి. కల్తీ మందులను అడ్డుకోవలంటే క్షేత్ర స్థాయి నుంచి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఇట్లా పైపైన తనిఖీలు చేస్తే ప్రయోజనం ఉండదని పరిశీలకులు చెబుతున్నారు.

**ఆ మందులన్నీ నాణ్యమైనా?**

మార్కెట్‌లో లభ్యమవుతున్న మందులు నాణ్యమైనా? అనే సందేహాలు ప్రతి ఒక్కరిలో ఉన్నాయి. ఈ సందేహం ఇప్పుడే కాదు.. ఎప్పటి నుంచో ఉంది. మార్కెట్?లో స్టాండర్డ్ కంపెనీలు, జనరిక్, చిన్న కంపెనీలు, వాటికి తోడు కార్పొరేట్ ఫార్మసీల ద్వారా మందులు విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాల్లో కార్పొరేట్ ఫార్మసీలు, హాస్పిటల్ అటాచ్డ్ ఫార్మసీలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. ప్రభుత్వం అనుమతితో ఏర్పాటు చేసిన ఈ మందుల దుకాణాల ద్వారా విక్రయిస్తున్న మందులు ఎంత వరకు నాణ్యంగా ఉంటున్నాయి అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే వాటి నాణ్యతను నిపుణులు తప్ప మరెవరూ చెప్పలేరు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ స్టోర్స్ యాజమానులు చెప్పిన ప్రకారం మందులు వినియోగిస్తుంటారు. నగరాల్లో ఆస్పత్రుల్లో ఆయా డాక్టర్లు రాసే మందులు అక్కడ ఉన్న మెడికల్ స్టోర్స్?లో తప్ప మరెక్కడా దొరకవు. కార్పొరేట్ ఫార్మసీలోనూ వారు సొంత బ్రాండ్‌పై ఉన్న ఉత్పత్తులను మాత్రమే విక్రయిస్తుంటారు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

**సరైన వేతనాలు ఇవ్వలేక..**

హైదరాబాద్ నగరంతోపాటు తెలంగాణ అంతటా అనేక మెడికల్ స్టోర్స్‌లో క్వాలిఫైడ్ పర్సన్స్ లేరన్నది వాస్తవం. ఫార్మసిస్ట్ లేకుండా, బిల్లు ఇవ్వకుండా ఏ మెడికల్ స్టోర్స్ నుంచి మందులు విక్రయించకూడదనే నిబంధన ఉంది. అలా బిల్లులు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. అనేక మెడికల్ స్టోర్స్‌ల్లో క్వాలిఫైడ్ పర్సన్స్ కానరారు. ఎందుకంటే అందుకు తగిన వేతనాలు ఇవ్వకపోవడం కూడా దీనికి కారణంగా తెలుస్తోంది.

**టెన్త్ చదివిన వారితో మందుల విక్రయం..**

సాధారణంగా డి–ఫార్మసీ, బీ–ఫార్మసీ అభ్యర్థులు ఇచ్చిన సర్టిఫికేట్లు ఆధారంగా మెడికల్ స్టోర్స్‌కు అనుమతి లభిస్తుంది. అందులో ఉద్యోగం చేస్తామని ఆయా అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తీసుకున్న తర్వాత డ్రగ్ కంట్రోల్ పరిపాలన అధికారులు లైసెన్స్ మంజూరు చేస్తారు. కానీ అనేక మెడికల్ స్టోర్స్‌ల్లో లైసెన్స్ కోసం ఫార్మసీ సర్టిఫికేట్ ఇచ్చే వ్యక్తులు ఉండడం లేదు. ఈ విషయం అధికారులకు కూడా తెలుసు. అయినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇక.. టెన్త్ చదివిన వారిని నియమించుకుని చాలాచోట్ల మందుల విక్రయం చేస్తున్నట్టు అధికారుల తనిఖీల్లో బయటపడింది.

**క్వాలిఫైడ్ పర్సన్స్ ఉంటే..**

అయితే.. క్వాలిఫైడ్ పర్సన్స్ లేకపోవడంతో ఇక్కడ రెండు తప్పిదాలు జరుగుతున్నట్టు తనిఖీల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం కొంత మంది డాక్టర్లు బ్రాండెడ్ పేరుతో ప్రిష్కిప్షన్ ఇస్తారు.

# తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్రం ఫోకస్

హైదరాబాద్, తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే అనేక మార్గాల్లో కొత్త రహదారులు మంజూరు చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పలు జాతీయ రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యతం రద్దీగా ఉండే హైదరాబాద్–విజయవాడ రహదారిని 4 నుంచి 6 వరుసలుగా విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మరికొన్ని ప్రాంతాల మధ్య కొత్తగా రహదారులు నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రహదారులు నిర్మిస్తుండగా.. మరికొన్ని రోడ్లను కేంద్రం నిర్మిస్తోంది. తాజాగా తెలంగాణలో మరో నేషనల్ హైవే నిర్మాణంపై కీలక హామీ వచ్చింది. చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్ల వరకు నేషనల్ హైవే నిర్మించాలని ఎప్పట్నుంచో డిమాండ్ ఉంది. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించారు. తాజాగా.. ఆ నేషనల్ హైవేపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక హామీ ఇచ్చారు. జాతీయ రహదారి నిర్మాణం విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. స్థానిక ప్రజల ఆంకాంక్షల మేరకు రోడ్డు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు ఈ విషయంపై ఎంపీకి వినతిపత్రం అందించారు. చేగుంట –%సిరిసిల్ల మధ్య నేషనల్ హైవే చేపడితే రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడకు ఈజీగా చేరుకోవచ్చునని అన్నారు. వేములవాడ–హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుందని చెప్పారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్ రావు ఈ రహదారి అంశాన్ని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నేషనల్ హైవే మంజూరుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రహదారి నిర్మాణంపై చర్చిస్తానని ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు. కాగా, ఎంపీ ప్రకటనతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణం కోసం పోరాడుతున్నామని చెప్పారు. త్వరితగతిన రహదారి మంజూరైతే.. ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని అంటున్నారు.

# తన్నుకుపోతున్న కార్పోరేట్లు

విశాఖపట్టణం, పెద్దపెద్ద ప్రాజెక్టులను ఎంతో ఉదాత్త ఆశయంతో, ప్రజల బలిదానా లతో, భూముల అప్పగింతతో ప్రారంభించినా..చివరకు అవి కొందరు పెట్టుబడిదారులు గద్దల్లా తన్నుకు పోతున్నారు. చిన్న పుల్లకూడా తీయని వ్యక్తులు వాటికి అధిపతులు అవుతున్నారు. తాజాగా మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను ఎపి పాలకులు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఎంతో పెట్టుబడి లక్ష్యంతో ఏర్పాటు చేసిన గంగవరం పోర్టు కూడా ఆదానీ తన్నేసుకు పోయారు. పెట్టుబడిదారులు సునయాసంగా ప్రభుత్వాలను బుట్టలో వేసుకుని పెట్టిన పరిశ్రమలను తన్నుకు పోతున్నారు. దీంతో వారికి స్థాపక ఖర్చు, కష్టం లేకుండా పోతోంది. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువులు రవాణా చేసేందుకు సదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది. ఃూష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.రిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్‌ఎ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ఎ÷–లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు. క నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అ÷–జ్గ÷ంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది.

# దండకారణ్యంలో రక్తపుటేరులు



హైదరాబాద్,దండకారణ్యంలో రక్తపుటేరులు పారుతున్నాయి. కాల్పుల మోతలతో బస్తర్ అడవులు మార్మోగుతున్నాయి. అబూజ్ మఢ్ కేంద్రంగా రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లలో చావుదెబ్బ తీస్తున్నాయి. గత ఏడాదిగా జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనల్లో ఇప్పటివరకు మూడు వందలకు పైగా మావోయిస్టులు హతమైనట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంనుంచీ గత ఇరవై రోజుల్లోనే మూడు ఎన్‌కౌంటర్లలో 44 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాశారంటే పోలీసులు ఎంతలా పైచేయి సాధించారో అర్థం చేసుకోవచ్చు. దండకారణ్యాన్ని చుట్టుముట్టి కాల్పులకు పాల్పడుతున్న సాయుధ బలగాలకు వెరచి గత ఏడాది కాలంలో సుమారు 850 మంది మావోయిస్టులు లొంగిపోగా, పోలీసులు మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగిస్తున్న ముప్పేట దాడికి సాంకేతిక పరిజ్ఞానమూ తన వంతు సహకారం అందిస్తూండటంతో మావోయిస్టులు మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. కాకులు దూరని కారడవిలో 650కి పైగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని, భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్నాయి. మావోయిస్టుల జాడ తెలియగానే విరుచుకుపడి మట్టుబెడుతున్నాయి. అబూజ్ మఢ్ అడవుల్లో మావోయిస్టుల జాడ పసిగట్టడంలో జిల్లా రిజర్వ్ గ్రూపు (డిఆర్‌జి)లదే కీలకపాత్ర. ముల్లును ముల్లుతోనే వెలికి తీయాలన్న ఉద్దేశంతో.. లొంగిపోయిన నక్సలైట్లను ఉపయోగించుకుని, మావోయిస్టుల జాడ కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిందే ఈ డిఆర్‌జి. దట్టమైన అడవిలో ఏది ఎక్కడుందో డిఆర్‌జిలకు కొట్టినపిండి కావడంతో గాలింపు చర్యలలో వారినే ముందుభాగంలో ఉంచుతున్నారు. ఇప్పటివరకూ జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో డిఆర్‌జిల సహకారం వల్లనే పోలీసులు పైచేయి సాధించారంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు నక్సలిజం అనేక రాష్ట్రాల్లో ఊడలూనుకుని, ప్రభుత్వాలను గడగడలాడించిన మాట వాస్తవం. నక్సలైట్లు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, పోలీసులపైన, ఇన్ఫార్మర్లపైన మెరుపుదాడులు జరిపి మట్టుబెడుతూ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. నక్సలైట్ల తుపాకులకు ఎందరో ప్రజాప్రతినిధులు బలైన సంఘటనలు కోకొల్లలు. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సైతం సాయుధ పోరాట దాడులతో విలవిల్లాడింది. కారణాలేమైతేనేం, ఉభయ తెలుగురాష్ట్రాల్లో నక్సలైట్ల జోరు తగ్గి, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాలకు విస్తరించింది. అడపాదడపా భద్రతాదళాలపై గెరిల్లా దాడులు చేస్తూ, మావోయిస్టులు ఉనికిని చాటుకుంటున్నారు. కేంద్రంలో మూడో దఫా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం మావోయిస్టులను తుడిచిపెట్టేందుకు కంకణం కట్టుకున్నట్లు చత్తీస్‌గఢ్ అడవుల్లో చోటు చేసుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్లను బట్టి తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి నెలలోగా మావోయిస్టులనుంచి చత్తీస్‌గఢ్‌కు విముక్తి కల్పిస్తామంటూ కేంద్ర హోం మంత్రి చేస్తున్న ప్రకటనలను కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. 'దేశంలో నక్సలిజం కొనఊపిరితో ఉంది. నక్సల్స్‌లేని భారత్ దిశగా ఇది ఓ కీలకమైన అడుగు' అంటూ తాజా ఎన్‌కౌంటర్ అనంతరం హోంమంత్రి ప్రకటించడం గమనార్హం. అయితే జరుగుతున్న ఎన్‌కౌంటర్లన్నీ ఆత్మరక్షణార్థం పోలీసులు జరిపిన ఎదురు కాల్పులేనా అంటే సందేహమే. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగినప్పుడు పోలీసుల పక్షాన ఎవరూ గాయపడకపోవడం, మృతులందరూ మావోయిస్టులే కావడం ప్రధానంగా ఇలాంటి అనుమానాలకు తావిస్తోంది. ఎన్‌కౌంటర్లపై మానవ హక్కుల సంఘాలు లేవనెత్తుతున్న అనుమానాలకు సరైన సమాధానాలు లభించడం లేదు. గత నెలలో అబూజ్ మఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మరణించిన సంఘటనపై మానవ హక్కుల కార్యకర్తలు తమ ఆక్రోశం వెలిబుచ్చారు. ఈ సంఘటనలో చిన్న పిల్లలు కూడా గాయపడ్డారనీ, పొలాల్లో పనిచేసుకుంటున్నవారిని తీసుకువెళ్లి కాల్చి చంపారన్నది వారి అభియోగం. ఆ మధ్య ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ సైతం ఇలాంటి అనుమానాలనే రేకెత్తించింది. మావోయిస్టులు తినే భోజనంలో మత్తుపదార్థాలు కలిపి, వారు స్పృహ కోల్పోయాక కస్టడీలోకి తీసుకుని చిత్రహింసల పాల్జేసి, చంపారంటూ మానవ హక్కుల సంఘాలు భగ్గుమన్నాయి. ఇలాంటి సంఘటనలను నిరోధించేందుకు గతంలో సుప్రీం కోర్టుతో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా విస్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశాయి. వాటిని తూచ తప్పకుండా అమలు చేసి ఇలాంటి ఆరోపణలకు అడ్డుకట్ట వేయడం పోలీసుల బాధ్యత.

# రసవత్తరంగా ఢిల్లీ రణం...




న్యూఢిల్లీ,శీతలగాలులు కమ్మేసిన సమయంలోనూ దేశ రాజధాని ఎన్నికల హంగామాతో వేడెక్కుతోంది. ఫిబ్రవరి 5న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమరంలో రాజకీయ పక్షాల 'ఉచిత హామీల' వ్యూహం ఊపందుకుంది. మహిళా ఓటర్లను కేంద్రంగా చేసుకొని ఎన్నికల మేనిఫెస్టోలలో పార్టీలు పోటా పోటీగా వాగ్దానాల వర్షం కురిపిస్తున్నాయి. 2012 నుంచి ఢిల్లీలో ఆధిపత్యం చూపుతున్న అధికార ఆప్, దాని ప్రధాన ప్రత్యర్థి బీజేపీలు రెండూ ఏక తీరున ఎడాపెడా హామీలిస్తుంటే, పోగొట్టుకున్న పట్టును వెతుక్కుంటూ కాంగ్రెస్ కొత్త ఉచితాల ప్రకటనలతో ఊపిరి పీల్చుకోవాలని చూస్తోంది. ఆప్ తన మేనిఫెస్టోలో సీనియర్ సిటిజన్లందరికీ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యచికిత్స, ఆటోడ్రైవర్లకు 5 గ్యారెంటీలు, అద్దెకున్నవారికి సైతం ఉచిత విద్యుత్, నీటి పథకం వర్తింపు లాంటివి ప్రకటించింది. బీజేపీ తన మేనిఫెస్టోలో హోలీ, దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లతో పాటు, గర్భిణు లకు రూ. 21 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ. 2.5 వేలు సహా పలు హామీలిచ్చింది. ఇప్పటికే తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని బీజేపీ తోసిపుచ్చకపోవడం ఢిల్లీ నమూనాను సమర్థించడమేనని ఆప్ ఎద్దేవా చేస్తుంటే... బీజేపీ మాత్రం ఆప్ మాటలు ధయాధర్మం చేస్తున్నామన్నట్లున్నా యనీ, తమది మాత్రం సమాజ సమగ్రాభివృద్ధికై సాగిస్తున్న సంక్షేమ వాగ్దానమనీ వాదిస్తోంది. వెరసి, మాటల యుద్ధంతో 70 స్థానాల ఢిల్లీ పీఠానికి పోటీ రసవత్తరంగా మారింది. 1993 నవంబర్‌లో తొలి ఢిల్లీ శాసనసభ ఏర్పాటైంది. అప్పటి నుంచి గమనిస్తే, ప్రజా ఉద్య మాలు పెల్లుబికిన ప్రతిసారీ జాతీయ రాజధానిలో అధికారం చేతులు మారిందని విశ్లేషణ. 1998లో షీలా దీక్షిత్ అధికారంలోకి వచ్చినా, 2013లో ఆమెను గద్దె దింపి అరవింద్ కేజ్రీవాల్ పీఠమెక్కినా... ప్రతి అసెంబ్లీ ఎన్నిక ముందు ఏదో ఒక ప్రజాందోళన జరిగిందని విశ్లేషకులు గుర్తు చేస్తుంటారు. 1998 నవంబర్‌లో ఎన్నికలైనప్పుడు అంతకంతకూ పెరుగుతున్న ధరలు సహా ప్రజల కోపకారణాలే ఊతంగా షీలా అధికారంలోకొచ్చారు. అంతకు కొద్దినెలల ముందు లోక్‌సభ ఎన్నికల్లో మంచి విజయం సాధించిన బీజేపీ తీరా ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. అలాగే, 2013లో నిర్భయ కేసులో ప్రజ్వరిల్లిన ప్రజాగ్రహం, అవినీతి అంశాల ఆసరాతో, ఉచిత విద్యుత్, నీటి సరఫరా హామీలు అండగా కేజ్రీవాల్ జయకేతనం ఎగరేశారు. సంక్షేమ పథకాలతో 2015, 2020లోనూ గట్టెక్కారు. పదేళ్ళ పైగా 'ఆప్' అధికారంలో ఉన్నందున ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత సహజమే. దాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీజేపీ అన్ని అస్త్రాలూ వాడుతోంది. కాంగ్రెస్ సైతం తానేమీ తక్కువ కాదన్నట్టు వ్యవహరిస్తోంది. చిత్రమేమిటంటే ప్రభుత్వ వ్యతిరేకత ఎంతున్నా అదేమీ పట్టనట్టు ఆప్, దాని అధినాయకత్వం ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఢిల్లీ ఓటర్ల మనసెరిగి ప్రవర్తించడంలో ఆరితేరిన అధికార పక్షం గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ సంక్షేమ పథకాలు, తాయిలాలతో వారిని ఆకట్టుకోగలిగింది. ఈసారి కూడా పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య బీమా అందిస్తామంటూ ఆప్ భారీ వాగ్దానమే చేసింది. నిజం చెప్పాలంటే, ఇతర పార్టీలు సైతం తన దోవ తొక్కక తప్పని పరిస్థితిని కల్పించడంలో కేజ్రీవాల్ విజయం సాధించారు. ఒకప్పుడు 'ఎన్నికల ఉచిత మిఠాయిలు' అంటూ ఈసడించిన ప్రధాని మోదీ సైతం చివరకు ఢిల్లీలో వాటికే జై కొట్టడం గమనార్హం. ఆప్ మళ్ళీ పగ్గాలు పడుతుందా, లేక పొరుగున హర్యానాలో అనూహ్య విజయంతో ఆశ్చర్యపరిచిన బీజేపీ ఢిల్లీలోనూ ఆ మ్యాజిక్ చేస్తుందా అన్నది ఆసక్తికరం. చిరకాలంగా లోక్‌సభలో బీజేపీకీ, అసెంబ్లీలో ఆప్‌కూ అనుకూలంగా వ్యవహరిస్తూ వస్తున్న ఓటర్లు ఈసారీ అలాగే చేస్తారా అన్నది ప్రశ్న. ఆప్‌కు ఒకప్పుడున్న అవినీతి రహిత ఇమేజ్, సామా న్యులకు సానుకూలమనే పేరు ఇప్పుడు దెబ్బతిన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల వలలో పార్టీ నేతలు చిక్కగా, కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఘర్షణతోనే పుణ్యకాలం హరించుకు పోవడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బే. ప్రతి ఎన్నికనూ జీవన్మరణ సమస్యగానే భావించే బీజేపీ ఎప్పటిలానే డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంతో ముందుకొచ్చింది. నిరుటి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భాగస్వాములుగా సీట్ల పంపిణీతో చెట్టపట్టాలేసుకున్న ఆప్, కాంగ్రెస్‌లు ఈసారి పరస్పరం కత్తులు దూసుకోవడమూ విడ్డూరమే. మరోపక్క భుజాలపై పార్టీ కండువాలు మార్చిన నేతలు పలువురు కొత్త జెండాతో బరిలో అభ్యర్థులుగా నిలవడం కార్యకర్తలకూ, పార్టీ నేతలకే కాదు... ఓటర్లకూ చీకాకు వ్యవహారమే. ఇలాంటి 20 మంది నేతల భవితవ్యం ఢిల్లీ కొత్త పీఠాధిపతిని నిర్ణయిస్తుందని అంచనా. అవన్నీ ఎలా ఉన్నా ప్రధాన చర్చనీయాంశం మాత్రం ఉచిత హామీలే.సమాజంలో అంతరాలు అంతకంతకూ అధికమవుతున్న పరిస్థితుల్లో అణగారిన వర్గాల సముద్ధరణకు చేయూత నివ్వడం సమంజసం. అయితే, విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెంచి, అట్టడుగు వర్గాలను పైకి తీసుకురావడం దూరదృష్టి గల పాలకులు చేయాల్సిన పని. అవసరం లేని ఉచితాలపై మాత్రం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల జాతరలో తాత్కాలికంగా పైచేయి అనుచితమైన ఉచితాలను పార్టీలు ప్రకటిస్తే, ఆ మాటలు నీటి మీది రాతలుగా మిగిలిపోతాయి. అథవా అమలు చేసినా, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, పాలనారథం తలకిందులయ్యే ప్రమాదమూ ఉంటుంది. అభివృద్ధి మంత్రానికీ, అధికారం కోసం పప్పుబెల్లాలు పంచాలనుకొనే ఉచితాల తంత్రానికీ నడుమ పోటీలో ఢిల్లీ జనం ఎటు మొగ్గుతారన్నది ఓట్ల లెక్కింపు జరిగే ఫిబ్రవరి 8న చూడాలి.

# ప్రపంచానికి మార్గదర్శిగా భారత్

అమరావతి, ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో ఉందని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, సరైన సమయంలో సాంకేతికత అందిపుచ్చుకోవాలని సూచించారు. జనాభా వైవిధ్యం, సుస్థిర వృద్ధిరేటు, పటిష్టమైన విధానాలతో పాటు సరైన నాయకత్వంతో ఇండియా బ్రాండ్ బలంగా ఉందని పేర్కొన్నారు. దావోస్‌లో మూడో రోజు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎపి బృందం ప్రఖ్యాత కంపెనీల సిఇఒలు, సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. భారత దేశం బ్రాండ్ ఇప్పుడు చాలా స్టాం÷–రగ్ గా ఉందని, దావోస్ లో వివిధ రాష్ట్రాలు పెట్టుబడుల కోసం పోటీపడుతున్నాయని తెలియజేశారు. దేశం కోసం అందరం కలిసి పని చేస్తున్నామని, సిఎంలుగా వేర్వేరు పార్టీలకు చెందినా, ప్రజల కోసం ఐక్యంగా ఆలోచిస్తామని బాబు వివరించారు. మేమంతా వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారిమైనప్పటికీ భారత్ కోసమే పని చేస్తున్నామన్నారు. తాము దావోస్ నుంచి టెక్నాలజీని తీసుకెళ్లడానికి రాలేదని, ప్రపంచానికే మా దేశం టెక్నాలజీని అందజేస్తోందని, అది మా భారతీయుల సత్తా అని ప్రశంసించారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ విశేష కృషి చేస్తోందని బాబు స్పష్టం చేశారు. దాదాపు అన్ని టెక్ కంపెనీల సిఇఒలు భారత సంతతికి చెందినవారే ఉన్నారని, సాంకేతికతను ముందుగా అందిపుచ్చుకున్న దేశంగా భారత్ ప్రయోజనాలు పొందుతోందన్నారు. వ్యాపార దక్షత, నైపుణ్యాలు ఉన్న యువత, జనాభా ఎక్కువగా ఉండటం భారత్

# పాత రికార్డులన్నీ బ్రేక్

హైదరాబాద్, గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై తెలంగాణ మరో కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఒకే రోజు భారీ పెట్టుబడులను సమీకరించింది. ముఖ్యంగా 3 కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రాష్ట్ర యువతకు దాదాపు 10,800 ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సంస్థ 'సన్ పెట్రో కెమికల్స్' రాష్ట్రంలో రూ.45,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ, జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై (ఎంవోయూ) సంతకం చేసింది. నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3,400 మెగావాట్లు. వీటికి 5,440 మెగావాట్ల సామర్థ్యముండే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ ఒప్పందంపై కీలక చర్చలు జరిపారు. పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్రెడ్డి, ఇన్వెస్టిమెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఎం సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించే తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చిన సన్ పెట్రో కెమికల్స్ ప్రతినిధులను అభినందించారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గత ఏడాది దావోస్లో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందని అన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. హరిత ఇంధన ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. సన్ పెట్రో కెమికల్స్ భాగస్వామ్యంతో భవిష్యత్తులో డిమాండ్‌కు అనుగుణంగా ఇంధన వనరులు సమకూరుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలతో పాటు నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మరోవైపు, తెలంగాణలో మరో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ అందుబాటులోకి రానుంది. రూ.10 వేల కోట్లతో దీనిని నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ కంపెనీ 400 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,600 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అటు, రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ స్థాపించనున్నట్లు జేఎస్?డబ్ల్యూ సంస్థ ప్రకటించింది. అమెరికాకు చెందిన డిఫెన్స్ టెక్నాలజీ సంస్థ అనుబంధంతో ఈ యూనిట్ నెలకొల్పనుంది. దాదాపు రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీనికి సంబంధించి దావోస్? వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ అనుబంధ సంస్థ అయిన జేఎస్‌డబ్ల్యూ యూఏవీ లిమిటెడ్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. ఐటీ, ఫార్మాతో పాటు అన్ని రంగాల పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయని, ఈ ఒప్పందంతో రక్షణ రంగంలో కీలక ఆవిష్కరణలతో పాటు డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం రక్షణ రంగంలో సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

# తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

హైదరాబాద్, తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్‌ను అమెరికాకు చెందిన టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. రూ.15,000 కోట్లతో టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ఎంవోయూ కుదర్చుకుంది. 300 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ప్రెసిడెంట్ సచిత్ అహుజాతో సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఉన్నతాధికారులు ఈ ఒప్పందం చేసుకున్నారు. టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం హైదరాబాద్ స్థాయిని మరింత పెంచుతుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం పట్ల టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ అధ్యక్షుడు సచిత్ అహుజా సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, దార్శనిక నాయకత్వం తమను ఆకట్టుకుందని సచిత్ అన్నారు. అలాగే.. హైదరాబాద్‌లో 5000 కోట్ల పెట్టుబడులకు అమెరికా సంస్థ ఉర్సా క్లస్టర్స్ ముందుకొచ్చింది. ఉర్సా క్లస్టర్స్ రాష్ట్రంలో అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను ఉర్సా క్లస్టర్ స్థాపించనుంది. ఒప్పందంపై ఉర్సా క్లస్టర్ సీవోవో సతీష్ అబ్బూరి, సీఆర్వో ఎరిక్ వార్నర్ సంతకం చేశారు. అలాగే హైదరాబాద్‌లో మరో డేటా సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. బ్లాక్ స్టోన్ సంస్థ రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదర్చుకుంది. హైదరాబాద్‌లో 150 మెగావాట్ల డేటా సెంటర్‌ను బ్లాక్ స్టోన్ ఏర్పాటు చేయనుంది. ఏఐ ఆధారిత సేవలను డాటా సెంటర్ అందించనుంది. కాగా.. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతంగా కొనసాగింది. అనేక ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయి. దాదాపు 10 ప్రముఖ కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరగా.. 46 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇక నేటితో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ముగియనుండటంతో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో ఆయన శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

## కాగ్నిజెంట్ నుంచి త్వరలో శుభవార్త

అమరావతి,కాగ్నిజెంట్ నుంచి త్వరలోనే ఏపీకి గుడ్‌న్యూస్ రాబోతోందని లోకేశ్ తెలిపారు. దావోస్ పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలో 2.2 మిలియన్ చదరపు అడుగుల కోవర్కింగ్ స్పేస్ అందుబాటులో ఉందని తెలిపారు. కాగ్నిజెంట్ గ్రోత్ స్ట్రాటజీ, ప్రాంతీయ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం వంటి టైర్–2 నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి వాటిలో హైస్కిల్డ్ వర్క్ ఫోర్స్‌ను తయారుచేయడా

# విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం



హైదరాబాద్,హైదరాబాద్ మహా నగరం విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలోని టాప్ సిటీల్లో హైదరాబాద్ కూడా ఒకటిగా నిలుస్తోంది. లండన్, న్యూయార్క్ వంటి ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలు ఉండగా.. నగర విస్తరణలో భాగంగా ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీని కూడా నిర్మిస్తున్నారు. దాదాపు 20 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది.

ఇక నగర విస్తరణలో భాగంగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని పెంచాలని భావిస్తోంది. ఔటర్ రింగు రోడ్డు వరకూ జీహెచ్ఎంసీని విస్తరణపై దృష్టిపెట్టింది. 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లనను గ్రేటర్‌లో కలపాలని భావిస్తోంది. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే మున్సిపల్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. జీహెచ్ఎంసీ కాకుండా ఓఆర్ఆర్ లోపల 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంతో పోలిస్తే అభివృద్ధిలో ఇవి వెనుకబడ్డాయి. నగరం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఓఆర్ఆర్ వరకూ ఒకేవిధంగా అభివృద్ధి చేసేందుకు వాటిని జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.

# కాంగ్రెస్‌లో ముసలం..చిచ్చురేపిన మహిపాల్ కామెంట్స్

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో ముసలం మొదలైంది. పటాన్ చెరు కాంగ్రెస్ నేతలు రోడ్డున పడి కొట్టుకున్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఓ వర్గం రోడ్డు ఎక్కి సేవ్ కాంగ్రెస్ అంటూ నినాదాలు అందుకుంది. పాత కొత్త కాంగ్రెస్ నేతల మధ్య పొసగడం లేదని అధినాయక్వం కలుగుజేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పటాన్ చెరు నియోజకవర్గం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన కామెంట్స్ కాంగ్రెస్ చిచ్చు పెట్టాయి. ఎప్పటి నుంచో కాంగ్రెస్‌లో ఉన్న నేతలకు వ్యతిరేకంగా విమర్శలు చేయడం ప్రస్తుతం వివాదానికి కారణమైంది. ఆయన కామెంట్స్‌కు వ్యతిరేకంగా ప్రత్యర్థులు ధర్నాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చి తమపై పెత్తనం చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారినప్పటి నుంచి పాత కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి అదే స్థాయిలో ఎమ్మెల్యే వర్గం నుంచి కూడా విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యేగా తన పనులకు అడ్డంకిగా మారుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య వివాదం మరింత ముదిరింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్‌కి అసలు పడటం లేదు. బీఆర్ఎస్‌లో తిరుగాబుట జెండా ఎగరేసి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారినప్పటి నుంచి మహిపాల్ రెడ్డి పెత్తనం ఎక్కువైపోయిందని శ్రీనివాస్ గౌడ్ వర్గీయులు దుమ్మెత్తి పోస్తున్నారు. వీళ్లకు తోడు నీలం మధు కూడా వంతపాడుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు వేధించారని ఇప్పుడు అదే పంథా సాగిస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా



చెప్పుకొని మహిపాల్ రెడ్డి ఆఫీస్‌లో సీఎం ఫొటో లేదని ఇంకా కేసీఆర్ ఫొటో ఉందని ఆరోపించారు కాట శ్రీనివాస్ వర్గీయులు. ఆయన కార్యాలయంలోకి వెళ్లి కేసీఆర్ ఫొటో తీసేసి రేవంత్ ఫొటో పెట్టారు. ఈ టైంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మరికొందరు ఫర్నిచర్‌ను కూడా రోడ్డుపైకి తీసుకొచ్చి ధ్వంసం చేశారు. పటాన్ చెరు కాంగ్రెస్‌లో జరుగుతున్న రగడపై అధినాయకత్వం జోక్యం చేసుకోవాలని శ్రీనివాస్, నీలం మధు వర్గీయులు విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్డు ఎక్కిన ఈ ఇద్దరి నేతల అనుచరులు సేవ్ కాంగ్రెస్ – సేవ్ పటాన్ చెరు అంటూ నినాదాలు చేస్తున్నారు. ఈ కాంగ్రెస్ నేతల ధర్నాతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని అక్కడి వారందర్ని తరలించారు. ముందస్తుగా అక్కడ భారీగా సిబ్బందిని మోహరించారు.

# టిడిపి ప్రయత్నాలు ఫలించేనా ?

అమరావతి,ఎన్టీఆర్‌కు భారతరత్ కోసం ఇప్పుడుమరోమారు టిడిపి గట్టిగా పట్టుబట్టే అవకాశం ఉంది. ఎందరికో భారతరత్న వస్తున్నా..ఎన్టీఆర్‌కు దక్కడం లేదు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని టీడీపీ బలంగా కోరుతోంది. ఎన్టీఆర్‌కు భారతరత్న వస్తుందని ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ కీలకంగా ఉంది. ఎన్టీఆర్‌కు భారతరత్న సాధించేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే దళిత్ ఐకన్, బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీ రామ్‌కు భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్ కూడా ఎప్పటి నుంచో ఉంది. గతంలో చాలాసార్లు బీఎస్పీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి ఈ డిమాండ్‌ను కేంద్రం ముందుంచారు. అలాగే సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, వీర్ సావర్కర్, జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయ్ పూలె, బీహార్ తొలి సీఎం శ్రీకృష్ణ సింగ్, బీపీ మండల్, ఒడిశా మాజీ సీఎం బీజూ పట్నాయక్ తదితరులు కూడా భారతరత్న రేసులో ఉన్నారు. ఈసారి దేశ అత్యున్నత పౌరపురస్కారం భారతరత్నను ఎవరికి ప్రకటిస్తారన్న అంశంపై ఆసక్తికర చర్చ మొదలయ్యింది. ఎప్పటిలానే పలువురు రాజకీయ ప్రముఖులకు భారత రత్న ఇవ్వాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మరికొందరు ప్రముఖుల పేర్లు కూడా భారత రత్న రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రిపబ్లిక్ డే వేళ త్వరలోనే భారత రత్న పురస్కారాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే అవకాశముంది. మరి భారతరత్న పురస్కారం రేసులో ఉన్న ప్రముఖులను పరిశీలిస్తే.. భారత రత్న పురస్కార రేసులో ధివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా, ధివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ముందున్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. గత ఏడాది అక్టోబర్ మాసంలో రతన్ టాటా కన్నుమూశారు. ముందు నుంచే ఆయనకు భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. మరణానంతం ఈ డిమాండ్ మరింత బలపడింది. రతన్ టాటాకు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ మహారాష్ట్ర కేబినెట్ తీర్మానం కూడా చేసింది.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గత ఏడాది డిసెంబరు 26న కన్నుమూశారు. ఆయనకు భారత రత్న ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీతో పాటు కొందరు ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు కూడా కోరుతున్నాయి. మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మృతి స్థల్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.



దీనితో పాటు మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇస్తే ఆశ్చర్యపోనక్కర్లేదని ఢిల్లీ వర్గాల సమాచారం. కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం కలిగిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి 2019లో భారత రత్న ఇచ్చిన మోదీ సర్కారు.. 2024లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించడం విశేషం. ఈ సారి మూడు లేదా నాలుగురికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రిపబ్లిక్ డేకి ముందు లేదా ఆ తర్వాత దీనికి సంబంధించి ప్రకటన వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికల ఉండటంతో.. ఆ తర్వాత భారతరత్న పురస్కారాలను ప్రకటించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.కాగా గత ఏడాది (2024) ఐదుగురు ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించింది. బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, బీజేపీ అగ్రనేత ఎల్కే అద్వానీ, మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్ సింగ్ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు భారత రత్న ప్రకటించారు. తొలిసారిగా ఒక సంవత్సరంలో ఎక్కువ మందికి భారతరత్న ప్రకటించడం విశేషం. గతంలో 1999లో నలుగురికి భారత రత్న ప్రదానం చేయడమే ఇప్పటి వరకు గరిష్ఠంగా ఉంది. 1954 నుంచి ఇప్పటి వరకు భారత రత్న పురస్కారం జాబితాలో చోటు దక్కించుకున్న వారి సంఖ్య 53కు చేరింది. ఈ సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

# మహాద్భుతంగా సాగుతున్న కుంభమేళ



ప్రయాగరాజ్,దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న ఆయా నదుల్లోని నీళు కొన్ని సమయాల్లో అమృత తత్వాన్ని సంతరించు కుంటాయి. ఈ సమయాన్నే కుంభమేళా సమయంగా భావిస్తారు. ఈ నదుల్లో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని పురణాలు చెబుతున్నాయి. మన పూర్వీకులు కూడా ఇదే చెప్పేవారు. అందుకే నదుల్లో ఆయా సమయాల్లో పుణ్యస్నానాలు చేస్తుంటారు. ఇప్పుడు కుంభమేళాలో కూడా నదీస్నానం చేసేందుకు కోట్లాది భక్తులు బారులు తీరుతున్నారు. మహా కుంభమేళాకు సంబంధించిన రాత్రిపూట దృశ్యాలు అద్భుతంగా సాక్షాత్కరిస్తున్నాయి. రాత్రివేళల్లో మహాకుంభ మేళా దీపకాంతులతో అందంగా ముస్తాభైన నవ వధువులా కనిపిస్తోంది. మహా కుంభమేళా..ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక..ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వేదికగా జరుగుతోంది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది తరలివస్తున్నారు. జనవరి 13 ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకూ దాదాపు నలభై అయిదు రోజులపాటు జరుగుతుంది. గంగమ్మతల్లిని మనసారా పూజించడం ఈ వేడుక అసలైన పరమార్థంగా పండితులు చెబుతుంటారు. క్షీరసాగర మథనం సమయంలో ఆ సాగరంలోంచి అమృతభాండం ఉద్భవించింది. ఆ పాత్రకోసం దేవతలు– రాక్షసులు పోరాటం సాగిస్తున్నప్పుడు అందులోంచి నాలుగు అమృతపు చుక్కలు భూలోకంలోని నాలుగు నదుల్లో పడ్డాయట. దాంతో ఆ నాలుగు నదులూ అత్యంత పవిత్రతను సంతరించుకున్నాయని పురాణాలు చెబుతున్నాయి. హరిద్వార్‌లోని గంగ, ఉజ్జయినిలోని శిప్రా, నాసిక్‌లోని గోదావరి, ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో అమృత చుక్కలు పడ్డాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతారు. ఈ కారణంగా ఆయా నదుల్లోని నీళ్లు కొన్ని సమయాల్లో అమృత తత్వాన్ని సంతరించుకున్నాయని చెబుతుంటారు. ఈ సమయాన్నే కుంభమేళా సమయంగా భావిస్తారు. అందుకే అప్పుడు ఈ నదుల్లో స్నానం చేసేందుకు కోట్లాది భక్తులు బారులు తీరుతుంటారు. ఆ ప్రత్యేక సమయాన్ని బృహస్పతీ సూర్యచంద్రుల కదలికల్ని బట్టి నిర్ణయిస్తారు. వీటి ఆధారంగానే కుంభమేళాను రెండు రకాలుగా జరుపుతారు. అవే అర్ధ కుంభమేళా, మహాకుంభమేళా. అర్ధ కుంభమేళాని ఆరేళ్లకోసారి చేస్తారు. మహా కుంభమేళా పన్నెండేళ్లకోసారి వస్తుంది. ఈ పన్నెండేళ్లకోసారి వచ్చే మహా కుంభమేళాను మాత్రం దేవతల గురువైన బృహస్పతి కదలికల్ని బట్టి నిర్ణయిస్తారు. బృహస్పతి తన రాశి చక్రాన్ని పూర్తి చేయడానికి 12 సంవత్సరాలు పడుతుంది. గనుక ఆ సమయాన్ని ఆధారంగా చేసుకునే తేదీలను ప్రకటిస్తారు. ఇప్పుడు జరుగుతోంది మహా కుంభమేళానే. మహా కుంభమేళాలో పాల్గొనేందుకు దేశం నుండి మాత్రమే కాకుండా విదేశాల నుండి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ క్రమంలోనే మహా కుంభమేళాకు సంబంధించిన రాత్రిపూట దృశ్యాలు ఇంటర్‌నెట్‌లో వైరల్ అవుతున్నాయి. రాత్రివేళ మహాకుంభం మేళా ఏర్పాట్లు చూసేందుకు తరలివస్తున్నారు. ÷ూత్రిపూట ఆకాశం నుండి తీసిన మహా కుంభమేళ ఫోటోలు నిజంగా హృదయాన్ని హత్తుకునేలా ఉన్నాయి. ఆ దృశ్యం ఎంత అందంగా, మనోహరంగా ఉందో మాటల్లో చెప్పలేం. కళ్లతో చూడాల్సిందే..మహాకుంభమేళా ఏర్పాట్లు పగటిపూట మాత్రమే కాదు.. రాత్రిపూట కూడా ప్రజల్లో ప్రత్యేక ఆకర్షణగా మిగిలిపోతుందనే చెప్పాలి. 'హర్ హర్ గంగే' అనే నామం జపిస్తూ ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఇకపోతే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారని, దీనితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కూడా ఇక్కడే జరగనుందని యూపీ సీఎం యోగి వివరాలు వెల్లడించారు. అలాగే, జనవరి 26 గణతంత్ర దినోత్సవం, మౌని అమావాస్య, వసంత పంచమి సందర్భంగా ..ప్రముఖుల రాక పెరుగనుంది. ఈ మేరకు ఫిబ్రవరి 5న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహాకుంభమేళాని సందర్శించే అవకాశం ఉందని సమాచారం. జనవరి 27న జరిగే మహా కుంభమేళలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 10న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ్‌రాజ్‌ని సందర్శిస్తారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నగరంలో నిర్వహించే పలు ప్రధాన కార్యక్రమాలకు హాజరు కానున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 1న జరిగే కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నారు. జనవరి 27న హోంమంత్రి అమిత్ షా తన షెడ్యూల్ ప్రకారం మహాకుంభ్‌లో పాల్గొంటారు. ఆయన సంగమంలో పవిత్ర స్నానం చేయనున్నారు. గంగపూజ నిర్వహించి అధికారులతో సమావేశం కానున్నారని తెలిసింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం, మౌని అమావాస్య, వసంత పంచమి సందర్భంగా మహాకుంభమేళాకు జనం మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్ రాజ్ ప్రాంతంలో జనసమూహ నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత మెరుగుపరచడపై సీఎం అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ సమయంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచిస్తూ అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు.

# మంత్రి సీతక్క వ్యాఖ్యలతో పల్లెల్లో ఎన్నికల ఫీవర్



హైదరాబాద్,తెలంగాణలోని పల్లెల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో ఏ నలుగురు ఓ చోట గూమి కూడినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. ఈసారి ఎవరు పోటీ చేస్తారు..? పోటీ చేసే ఫలానా మల్లయ్య లేదా ఎల్లయ్య గెలుస్తాడా..? ఓట్లు పడతాయా..? అని సీరియస్ డిస్కషన్ పెట్టుంటున్నారు. ఇక నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు సైతం ఎదురు చూస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న వారు గ్రామాల్లోనే మకాం వేసి ప్రజల్ని మచ్చిక చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంచి, చెడులతో ఏమాత్రం సంబంధం లేకుండా గ్రామాల్లో ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమవుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకేసి ప్రత్యేకంగా మేనిఫెస్టో సైతం రిలీజ్ చేస్తున్నారు. తమను గెలిపిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి పథకంలో తీసుకెళ్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక అప్డేట్ ఇచ్చారు. గ్రామ పంచాయతీలకు వీలైనంత త్వరలో ఎన్నికలను నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయగా.. ఇప్పటికే నివేదిక సిద్ధమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చాక ఆమోదం పొందుతుందని తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన మంత్రి.. సీఎం రేవంత్ వచ్చాక పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటుందని అన్నారు. కాగా, మంత్రి ప్రకటనతో ఆశాశహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికలు ఉండే ఛాన్స్ ఉందని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేసే వారు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో మొత్తం 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. 1,14,620 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలను నిర్వహించనుంది. అందుకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించింది. క్రితంసారి 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో మ్నొత్తం 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి అదనంగా మరో 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిసింది. గతేడాది ఫిబ్రవరితో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలనను సాగిస్తున్నారు.

# తెలంగాణలో అమెజాన్ భారీ పెట్టుబడి

హైదరాబాద్, పెట్టుబడుల వేటలో దావోస్‌లో సిఎం రేవంత్ బృందం బిజీగా ఉంది. వరుస భేటీలతో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు సాగుతున్నాయి. తాజాగా తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందు కొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్‌సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఈ పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్లను అమెజాన్ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మరోవైపు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. పోచారంలో ఐటీ క్యాంపస్ విస్తరణకు ఇన్ఫోసిస్ అంగీకారం తెలిపింది. రూ.750కోట్లతో మొదటి దశ విస్తరణ చేపడతామని ఆ సంస్థ తెలిపింది. దీంతో కొత్తగా 17వేల ఉద్యోగాలు రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దావోస్ వేదికగా తెలంగాణలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఎంవోయూ చేసుకుంది. ఈ సంస్థ హైదరాబాద్‌లో 300 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్ ప్రెసిడెంట్ అహుజాతో జరిగిన భేటీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ ఎంవోయూ చేసుకున్నారు. హైదరాబాద్‌లో రూ.4,500 కోట్ల పెట్టుబడులకు బ్లాక్‌స్టోన్ ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ హైదరాబాద్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.అమెరికా సంస్థ ఉర్స్ క్లస్టర్స్ తెలంగాణలో రూ.5 వేల కోట్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకుంది. మంత్రి శ్రీధర్ బాబుతో ఉర్స్ క్లస్టర్స్ సీహోవో సతీశ్, సీఆర్వో ఎరిక్ వార్నర్ భేటీ అయ్యారు. ఈ సంస్థ హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు మైత్రా ఎనర్జీ గ్రూప్ ఒప్పందం చేసుకుంది. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో మైత్రా



గ్రూప్ డైరెక్టర్ గిరీశ్ గెల్లి భేటీ అయ్యారు. రూ.7వేల కోట్ల పెట్టుబడికి సంబంధించి మైత్రా గ్రూప్ ఎంవోయూ చేసుకుంది. హైదరాబాద్‌లో 6.9 గిగావాట్ల సోలార్స్ సెల్స్, మాడ్యూల్స్ యూనిట్ ఏర్పాటుకు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. మరో 6.9 గి.వా. సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. మైత్రా ఎనర్జీ ప్రాజెక్టులతో సుమారు 2,500 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

### 6న ఎపి కేబినేట్ భేటీ

అమరావతి, ఏపీ మంత్రివర్గ సమావేశం ఫిబ్రవరి 6న జరుగనుంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ సందర్భంగా ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రంలోగా ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదం కోసం పంపాలని ఆదేశాలు

# హైదరాబాద్‌ను కమ్మేసిన పొగమంచు..

హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను పొగమంచు కమ్మేసింది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం 7 గంటలు దాటినా దట్టంగా మంచు కురుస్తూనే ఉన్నది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఓ వైపు చలిగాలులు, మరోవైపు పొగమంచు ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పొగమంచు కారణంగా రోడ్లు కనిపించకపోవడంతో వాహనాలు మెల్లగా వెళున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వాహనదారులుప్రయణిస్తున్నారు. కూడళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.నగర శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్ పరిసరాల్లో మంచు దట్టంగా కమ్మేసింది. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదించాయి. కరీంనగర్ హైవేపై శామీర్‌పేట పరిసరాల్లో మంచు దుప్పటి పరుచుకున్నది. భారీగా మంచు కురుస్తుండటంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ జిల్లాలో దట్టంగా పొగమంచు అలముకున్నది. నార్కట్‌పల్లి–అద్దంకి రోడ్డుపై మంచుతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.



ఇత మంచును గతంలో ఎప్పుడూ చూడలేదని వాహనదారులు అంటున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కూడా పొగమంచు భారీగా కురుస్తున్నది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మంచు కమ్మేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com